క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. ఫాల్గుణ మాసం పంచమి కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం



సంపరలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన రామాలయంలోని ఆంజనేయ స్వామివారికి పంచామృతాభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం పంచమి మంగళవారం సందర్భంగా స్వామి వారికి తమలపాకుల, గంగా సింధూర పూజలు తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆర్వోబీల నిర్మాణానికి గెజిట్ నోటిఫికేషన్

పెదపూడి: అనపర్తి మండలంలో లక్ష్మీనరసాపురం, మండపేట మండలం కేశవరంలో రైల్వే రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేశవరం, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో ఆర్ఓబీ లేకపోవడంతో ప్రజలు రైల్వే గేట్ దాటి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా నిర్మాణాలు పూర్తయితే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. స్థల సేకరణ పూర్తయితే వెంటనే నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

హెల్త్ సైన్సెస్ చదివితే మంచి ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న డాక్టర్ విజయ భాస్కరరాజు

రాజానగరం: హెల్త్ సైన్సెస్ అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) సీఏఓ డాక్టర్ కె.విజయ భాస్కరరాజు అన్నారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ అంచెలంచెలుగా ఎదిగేందుకు ప్రయత్నించాలన్నారు. జీజీయూ డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, డీన్ డాక్టర్ ఎస్.లీలావతి, డాక్టర్ బి.శ్రీనివాసరాజు, కిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు



దేవస్థానం పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ కల్యాణోత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం కోరుకొండలోని ప్రధాన కూడళ్లు, బస్టాండు, కూరగాయల మార్కెట్, పాత సంత మార్కెట్, సంత బజారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, సినిమా థియేటర్, పోలీసు స్టేషన్ సెంటర్లలో పోలీసులు తయారుచేసిన స్కీమ్ చార్టును ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో ఉత్సవాలతో పాటు పోలీసుల సమాచారాన్ని ఉంచుతామన్నారు. అలాగే డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్ సుందర్‌తో కలిసి స్వామివారి దేవస్థానం పరిసర ప్రాంతం, రథోత్సవం నిర్వహించనున్న రోడ్లను పరిశీలించారు.

నారీ ఫెస్ట్.. ఫుల్ జోష్

- నన్నయలో నారీ ఫెస్ట్ 2025 ప్రారంభం
- ఆకట్టుకున్న ప్రసంగాలు
- అలరించిన ప్రదర్శనలు



వీరనారీమణులు, సేవాతత్పరుల వేషధారణలో..



రాణీ రుద్రమదేవిగా..

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'నారీ ఫెస్ట్ 2025' పేరిట మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతా, యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః' .. స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దైవత్వం వికసిస్తుంది, అగౌరవించబడితే అక్కడ ఎంతటి వారికైనా తిప్పలు తప్పవనే విషయాన్ని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీతోపాటు పలువురు వక్తలు తమ ప్రసంగాల ద్వారా గుర్తు చేశారు. పూర్వకాలంలో వివక్షతకు గురైనప్పటికీ రాబోయే కాలంలో వివక్షత లేని సమాజం వైపు అడుగులు వేయాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. ఇదే విషయాన్ని వెల్లడిస్తూ, సమాజంలో మహిళల పాత్రను తెలియజేస్తూ నిర్వహించిన కార్యక్రమాలు, ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

చిన్నారుల కేరింతలు

వేదికపై మొదటిసారిగా నిర్వహించిన హెల్త్ బేబీ షో పోటీలకు విశేష స్పందన లభించింది. రాజానగరం, రాజమహేంద్రవరం పరిసరాల నుంచి పలువురు తల్లులు తమ చిన్నారులతో కలిసి వచ్చి, సందడి చేశారు. చిన్నారులకు బుడగలు ఇచ్చి, పోటీలు పెట్టారు. ఇదే సమయంలో ఆ చిన్నారుల ఉత్సాహాన్ని చూస్తూ తల్లులు కూడా చప్పట్లు కొట్టి ప్రోత్సహిస్తూ, కేరింతలు కొట్టించారు.

అదిరిన బామ్మ–మనుమరాలి ఫ్యాషన్ షో

బామ్మ మాట బంగారు బాట అనే విషయాన్ని తేటతెల్లం చేస్తూ, పెద్దలు చెప్పే మాటలు వింటూ వారి మార్గంలో పయనించాలనే స్ఫూర్తిని అందిస్తూ నిర్వహించిన 'బామ్మ – మనుమరాలి' షో అదిరింది. ఈ షోకు కూడా అపూర్వ ఆదరణ లభించింది. పెద్దలను పిల్లలు ఎల్లప్పుడూ గౌరవించాలని, వృద్ధాశ్రమాల అవసరం లేని సమాజం వైపు పయనించాలనే సందేశానందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రూప్ సింగింగ్, ఫ్యాషన్ షో, స్కిట్, డ్యాన్స్ తదితర పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. యూనివర్సిటీతో పాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలోని మహిళలు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశంలో వివిధ రంగాలలో పేరుప్రఖ్యాతులందుకున్న మహిళలు, స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడిన వీరనారీమణులు, సేవాతత్పరుల గురించి తెలియజేసేలా ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



సావిత్రీబాయి పూలేగా..



గ్రూప్ డ్యాన్స్



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ఇంటర్ పరీక్షలకు 36 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రంలోని రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ ఇంగ్లిష్ పరీక్షకు 36 మంది గైర్హాజరైనట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. రంగంపేట, రాజానగరం మండలాలకు చెందిన విద్యార్థులు మొత్తం 754 మంది ఏ, బీ సెంటర్లకు హాజరు కావాల్సి ఉంది. ఏ–సెంటర్‌లో 22, బి–సెంటర్‌లో 14 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్టు వారు తెలిపారు. బుధవారం ఇంటర్మీడియెట్ సెకండియర్ ఇంగ్లిష్ పరీక్ష జరుగుతుందని చెప్పారు.

రహదారి భద్రతపై అవగాహన



రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఉన్న శ్రీపడాల పెదపుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ రహదారి భద్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు వాహనాలపై ప్రయాణించేటప్పుడు, రోడ్లపై నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పెద్దలు విధిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ అపాయకరమని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల మెరుగుకు చిత్తశుద్ధితో కృషి

- కలెక్టర్ ప్రశాంతి
- మండలంలో ఆకస్మిక పర్యటన



చంద్రేడులో స్థానిక సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రంగంపేట: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడానికి పంచాయతీల సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రంగంపేట మండలంలో మంగళవారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా మండలంలోని చంద్రేడు గ్రామాన్ని సందర్శించి, స్థానిక సచివాలయం వద్ద గ్రామస్తులతో భేటీ అయ్యారు. ప్రజల విన్నపాలను ఓపికతో విన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ సమీపంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ ట్యాంక్ నుంచి నీరు లీకవుతుండడంతో సిబ్బందిని ప్రశ్నించారు. ట్యాంకు నిర్మించి 30 ఏళ్లు పూర్తికావడంతో లీకేజీలు ఏర్పడ్డాయని గ్రామస్తులు వివరించడంతో, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈని ఆదేశించారు. గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రామంలో సంపద సృష్టి కేంద్రం మంజూరైనప్పటికీ, న్యాయపరమైన చిక్కుల కారణంగా నిర్మాణం జరగలేదని, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరో ప్రదేశాన్ని ఎంపిక చేశామని, సాంకేతిక మంజూరుకు పంపుతున్నట్టు ఈఓపీఆర్డీ పి.వెంకటరత్నం కలెక్టర్‌కు వివరించారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ విధులకు సరిగా రావడంలేదని, సరైన కారణాలు లేకుండా దీర్ఘకాలిక సెలవులు పెడుతుందని కలెక్టర్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు విన్నవించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బి.వెంకన్నబాబును కలెక్టర్ వివరణ కోరారు. అనంతరం ఇటీవల డయేరియా ప్రబలిన పాత వీరంపాలెం గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. డయేరియా బాధితుల వివరాలను ఆరా తీసి, డయేరియాపై ఆరోగ్య సిబ్బంది తీసుకున్న చర్యలను, ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై ఎంపీడీఓ వి.వీరసాయిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, విస్తరణాధికారి వెంకటరత్నంను అడిగితెలుసుకున్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

సమష్టి కృషితో విజయపథాన నడవాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



పార్టీ నూతన అనుబంధ విభాగాల అధ్యక్షులను సత్కరిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ శ్రేణులందరి కృషితో వైఎస్సార్ సీపీని విజయపథంలో నడిపించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ అనుబంధ విభాగాల నూతన అధ్యక్షులకు అభినందన సత్కార కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కష్టకాలంలో అందరిపైనా బాధ్యత ఉంచి పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పదవులు అప్పగించారన్నారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేసి, పార్టీ విజయానికి నూతనోత్సాహంతో పని చేయాలన్నారు. కష్టించి పనిచేసే వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం నూతనంగా పదవులు పొందిన వారికి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఇమ్మంది విజయకుమారి, బీసీసెల్ అధ్యక్షుడు కొండేటి భీమేష్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆరుగుళ్ల నాగేశ్వరరావు, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడు ఈ.మహేష్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కర్రి వీరవెంకట సత్యనారాయణరెడ్డి, లీగల్‌సెల్ కన్వీనర్ వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్సీసెల్ విభాగం అధ్యక్షుడు సాంబత్తుల చంటి, వీవర్స్ విభాగం అధ్యక్షుడు పప్పు సింహాచలం, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు కొమరపు శ్యాంబాబు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడు పొలునాటి స్వర్ణలత, రైతు విభాగం అధ్యక్షుడు నలమాటి సుబ్బారావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ షరీఫ్‌బాషా, విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డు నాని, కల్చరల్ విభాగం అధ్యక్షుడు కొల్లం వెంకటరమణ, డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు ముంగి గంగరాజు, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కర్రి శ్రీను, బూత్ కమిటీల కన్వీనర్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగంపేట జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల బుజ్జి, గుత్తుల రమణ, పార్టీ నాయకులు కొల్లాటి ఇజ్రాయేలు, జిల్లా పంచాయతీ విభాగం అధ్యక్షుడు పాలాటి నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'విశిష్ట సంఖ్య' నమోదు 72 శాతం పూర్తి



సంపరలో విశిష్ట సంఖ్య నమోదును పరిశీలిస్తున్న ఏఓ

పెదపూడి: రైతుల విశిష్ట సంఖ్య(యూనిక్ కోడ్) నమోదు ప్రక్రియ మండలంలో 72 శాతం పూర్తయిందని మండల వ్యవసాయ శాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఏపీత్రయం, కైకవోలు, సంపర, పెదపూడి తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులు నిర్వహిస్తున్న విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో మొత్తం 10,500 మంది రైతులకు గాను 7,600 మంది నమోదు చేయించుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు రిజిస్ట్రీ పోర్టల్(ఏపీఎఫ్ఆర్)లో రైతులు వారి భూములకు సంబంధించి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ(డిజిటలైజేషన్) చేయడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్యను రైతులకు అందిస్తుందన్నారు. సొంత భూమి కలిగిన రైతులు, ఇంట్లో ఎంత మంది పేరున పొలం ఉంటే అందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ప్రజాభిప్రాయంతోనే ఇసుక ర్యాంపుల ఏర్పాటు



సింగవరం సభలో పాల్గొన్న జేసీ చిన్నరాముడు, మైన్స్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి

సీతానగరం: గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణతోనే నూతన ఇసుక ర్యాంపుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు అన్నారు. నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై సింగవరం, కాటవరం సచివాలయాల్లో మంగళవారం పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సింగవరం ఓపెన్ రీచ్‌లో గోదావరి పరివాహక ప్రాంతంలో 34.4 హెక్టార్లు ప్రభుత్వ భూమిలో ఏడాదికి 3.44 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరుపుతామన్నారు. దీనిపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ సింగవరం ర్యాంపు నుంచి వెళ్లే ఇసుక లారీలతో దుమ్ము, ధూళి ఎగసిపడి పంటలు పాడవుతున్నాయని తెలిపారు. ర్యాంపులో ఇసుక తవ్వకాలు జరిపి వంగలపూడి ర్యాంపు నుంచి లారీలు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనికి జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు సానుకూలంగా స్పందించారు. కొందరు రైతులు సింగవరం ర్యాంపు నుంచి లారీలు వెళ్లడానికి అభ్యంతరం లేదని తెలిపారు. దుమ్ము ధూళి ఎగరకుండా రోడ్డును నీటితో తడపాలని పలువురు కోరారు. కాటవరం సచివాలయంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఏడాదికి 2.31 లక్షల క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరుపుతామని తెలిపారు. ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ఎటువంటి అభ్యంతరం లేదని స్థానికులు వెల్లడించారు. కార్యక్రమంలో మైన్స్ ఏడీ ఫణి భూషణ్ రెడ్డి, పర్యావరణాధికారి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, వీఆర్వోలు ఇందుగుమిల్లి గంగరాజు, గెడ్డం గంగరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిస్టాక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారి

మధురపూడి: రైతులు విధిగా అగ్రి స్టాక్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాధవరావు అన్నారు. కోరుకొండ మండలం మునగాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో మాట్లాడుతూ భూమిగల రైతులందరూ అగ్రిస్టాక్‌లో నమోదు కావాలన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలను అందుకోవచ్చన్నారు. అపరాలు, మొక్కజొన్న సాగులో మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీలు జయలక్ష్మి, మల్లికార్జునరావు, మండలాధికారిణి గౌరీదేవి పాల్గొన్నారు.

ఆరోగ్యానికీ పరీక్షే..

- పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి
- ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం
- నిద్ర, పౌష్టికాహారానికి ప్రాధాన్యమివ్వాలి



ఊలపల్లిలో పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

బిక్కవోలు: ప్రతి విద్యార్థి జీవితంలో పరీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఏడాది పాటు చదివిన విద్యను చివరిలో మూడు గంటలు జరిగే పరీక్షలో చూపించాలి. దానిలో వచ్చిన మార్కుల ఆధారంగానే తదుపరి చదువులు ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయి. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. రాత్రింబవళ్లు చదవడంతో ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. కాబట్టి మార్కులకే కాదు విద్యార్థుల ఆరోగ్యానికి ఇది పరీక్షా సమయమే.

మార్కులే ప్రామాణికం

ఏడాది శ్రమ ఫలితానికి పరీక్షలే ప్రామాణికం. అందుకే పరీక్షలు సమీపించే కొద్దీ విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాబోధకులు ప్రత్యేక దృష్టి సారిస్తారు. పరీక్షలంటే కొందరు విద్యార్థులకు భయం, ఆందోళన వస్తుంటాయి. విద్యార్థులు అధిక సమయం చదవడం, పౌష్టికాహారం తీసుకోకపోవడం, నిద్ర పోకుండా మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఈ నేపథ్యంలో పరీక్షలంటే సాధారణమని సామాజికమని చెబుతూ వైద్యులు విద్యార్థుల్లో మనోధైర్యం నింపుతున్నారు.

ప్రణాళికతో మంచి ఫలితాలు

పదో తరగతి పరీక్షలకు ఇప్పటికే హాల్ టిక్కెట్లు జారీ అయ్యాయి. ప్రతి రోజూ సబ్జెక్టులపై గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికి ప్రీ పబ్లిక్ పరీక్షలు జరిగాయి. పరీక్షల సమయంలో విద్యార్థులు చదువుతో పాటు యోగా చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులు ముందుకు సాగితే ఆనందంగా పరీక్షలు రాయవచ్చు. పరీక్షల సమయంలో ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకం. అనపర్తి నియోజకవర్గాల్లో 39 ఉన్నత పాఠశాలలో 2,796 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే ఐదు వేల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గం

మండలం	ఉన్నత పాఠశాలలు	పదో తరగతి విద్యార్థులు
అనపర్తి	8	831
బిక్కవోలు	8	607
పెదపూడి	14	785
రంగంపేట	9	573
మొత్తం	39	2,796

ఒత్తిడికి గురికావొద్దు



పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా మానసికంగా ధృడంగా ఉండాలి. ముందుగా ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఏకాగ్రతతో జవాబులు రాయడం మొదలు పెట్టాలి. శరీరం దృఢంగా ఉంటేనే మానసికంగా బలంగా ఉంటాం. మంచి ఆహారంతో ఆరోగ్యాన్ని పదిలంగా చూసుకోవచ్చు. విద్యార్థులు తగినంత నీరు తాగాలి. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ చూపాలి. టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలి.

– తేతలి రామారెడ్డి, మానసిక వైద్యుడు, అనపర్తి

పౌష్టికాహారం తీసుకోవాలి



శరీరం, మనస్సు ఒకదానికొకటి అవినాభవ సంబంధం కలిగి ఉంటాయి. మనం తీసుకునే ఆహారం ఈ రెండింటినీ ప్రభావితం చేస్తుంది. పరీక్ష సమయంలో మానసికంగా, శరీరకంగా ఆరోగ్యంగా ఉండాలి. పోషక విలువలున్న ఆహారాన్ని సమపాళ్లలో తీసుకోవాలి. రోజు ఒక పండు, వారంలో రెండు రోజులు ఆకు కూరలు ఉండేలా చూసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకూ సాత్వికాహారం తీసుకుంటే మంచిది.

– డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, కొంకుదురు

నరసన్న తీర్థానికి ఏర్పాట్లు



విద్యుత్ పనులు చేస్తున్న సిబ్బంది

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి తీర్థానికి జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 9 నుంచి 15 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు. 10వ తేదీ మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం జరుపుతారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఏపీఈపీడీసీఎల్ అధికారుల ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. రథోత్సవం జరిగే ప్రాంతంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.